సాక్షి
ఖమ్మం

సోమవారం, 7, అక్టోబర్, 2024



నాడు రైతులు.. నేడు కూలీలు

ఒకప్పుడు పలు రకాల పంటలతో కళకళ లాడిన రాకాసితండా వానులు.. నేడు ఇతర ప్రాంతాలకు కూలికి వెళ్తున్నారు. 8లో



జాతిని జాగృతం చేసే 'కథ'..

జామవా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఖమ్మం జెడ్పీ సమావేశ మందిరంలో 'కథ – 2023' పుస్తకాన్ని ఆవిష్కరించారు. 8లో



వాతావరణం

జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది. రాత్రికి కొన్ని ప్రాంతాల్లో జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అన్నపూర్ణాదేవిగా అలివేలు మంగమ్మ

- జమలాపురంలో కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



శ్రీ అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా పేరు గాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీవారికి అర్చకులు తెల్లవారుజామున పంచామృతాభిషేకం గావించారు. శ్రీవారి, అమ్మవార్ల ఉత్సవ మూర్తుల వద్ద శాస్త్రోక్తంగా హోమం, ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత శ్రీ అలివేలు మంగ అమ్మవారిని శ్రీ అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో భారీగా హాజ రైన మహిళలతో సామూహిక కుంకుమార్చన చేయించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల భక్తులు శ్రీవారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఆలయ ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ముఖ్య అర్చకులు ఉప్పల మురళీమోహన్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీ విజేత ఖమ్మం జట్టు



బహుమతి అందుకుంటున్న బాలికల జట్టు

బోనకల్/కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రాబెల్స్ హైస్కూల్ మైదానంలో రెండురోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో రంగారెడ్డి జిల్లా, ద్వితీయ స్థానంలో ఆదిలాబాద్, తృతీయ స్థానంలో వరంగల్ జట్లు, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో ఖమ్మం, ద్వితీయ స్థానంలో హైదరాబాద్, తృతీయ స్థానంలో వరంగల్ జట్లు నిలిచాయి. విజేతలకు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పీవీ రమణ, జిల్లా అధ్యక్షుడు ఎల్.నర్సింగరావు, కోశాధికారి చిన్నయ్య, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కృష్ణమూర్తి, రైల్వే కోచ్ శశి కప్‌లు అందించారు.

పండుగకు ముందే పదవులొచ్చేనా?!

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఐదుగురికి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు దక్కాయి. ఇవికాక ఇంకా ఒకరిద్దరికి పదవులు లభిస్తాయని.. ఈ పదవులను దసరా పండుగకు ముందే భర్తీ చేస్తారనే ఊహాగానాలతో ఆశావహులు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు, ముఖ్య నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరోవైపు గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలు సిద్ధమైనందున ఎప్పుడైనా ఎన్నికల నగారా మోగే అవకాశముంది. ఆ లోపే నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తే ఫలితం ఉంటుందనే ఆలోచనలో పార్టీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం



నామినేటెడ్ పోస్టుల కోసం ఆశావహుల నిరీక్షణ

- ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఐదుగురికి అవకాశం
- జాబితాలో మరో ఇద్దరికి స్థానం ఉంటుందని ప్రచారం
- మంత్రులు, ముఖ్య నేతల చుట్టూ ప్రదక్షిణలు
- పంచాయతీ ఎన్నికల నేపథ్యాన ధీమా

రెండు విడతల్లో ఐదు పదవులు..

ఇప్పటికే రెండు విడతలుగా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయగా ఉమ్మడి జిల్లాలో ఐదుగురికి అవకాశం దక్కింది. రాయల నాగేశ్వరరావును రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా, పొదెం వీరయ్యను ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా, మువ్వా విజయ్‌బాబును ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా, నాయుడు సత్యనారాయణను హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా, నూతి శ్రీకాంత్‌ను బీసీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమించారు. వీరు చాన్నాళ్ల క్రితమే బాధ్యతలు స్వీకరించి శాఖాపరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

జాబితా పెద్దదే...

నామినేటెడ్ పదవులు ఎన్ని వస్తాయన్న విషయాన్ని పక్కన పెడితే.. ఉమ్మడి జిల్లాలో ఆశావహుల జాబితా మాత్రం భారీగానే ఉంది. సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి భర్త డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా నియోజకవర్గం నుంచి బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, భద్రాచలం నియోజకవర్గం నుంచి బుడగం శ్రీనివాస్, మధిర నియోజకవర్గం నుంచి వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, మండడపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, డాక్టర్ కోట రాంబాబు, ఐలూరు వెంకటేశ్వర రెడ్డి, పైడిపల్లి కిషోర్ పదవుల రేస్‌లో ఉన్నారు. ఇక ఖమ్మం నియోజకవర్గం నుంచి కమర్తపు మురళి, సాధు రమేష్‌రెడ్డి, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జావేద్, మద్ది శ్రీనివాస్‌రెడ్డి, పాలేరు నుంచి కన్నెగంటి శివ రామకృష్ణ, పినపాక నియోజకవర్గంలో తుళ్లూరి బ్రహ్మయ్య, బట్టా విజయ్, కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోట్ల నాగేశ్వరరావు, నాగా సీతారాములు, ఎడవల్లి కృష్ణ, ఇల్లెందు నియోజకవర్గంలో మేకల మల్లిబాబుయాదవ్, డాక్టర్ జి.రవి నామినేటెడ్ పదవుల కోసం తమవంతు ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

ఇంకా ఎవరికి?

రాష్ట్ర వ్యాప్తంగా పలు నామినేటెడ్ పదవులు ఖాళీగా ఉండడంతో త్వరలో భర్తీ చేస్తారన్న సమాచారంతో ఆశావహులు స్పీడ్ పెంచారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల ముఖ్య అనుచరులు ఈ పదవుల కోసం పోటీ పడుతున్నారు. అలాగే రాజ్యసభ సభ్యురాలు రేణు కాచౌదరి అనుచరులు సైతం రేస్‌లో ఉన్నారు. అయితే ఇప్పటికే ఐదు పదవులు దక్కించుకున్న నేతలు ఏ మంత్రికి అనుచరులో ఆరా తీస్తూ.. మిగతా మంత్రుల అనుచరులు ఈసారి తమకే బెర్త్ ఖాయమనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. కానీ గతంలోనే ఐదుగురికి పదవులు ఇచ్చినందున ఈసారి ఒకరికా లేక ఇద్దరికి అవకాశం ఉంటుందా.. అవి ఎవరికి దక్కుతాయనే ఉత్కంఠ నెలకొంది.

ఎక్కడా అసంతృప్తి లేకుండా..

సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ కార్యాచరణ రూపొందించింది. నూతన పీసీసీ అధ్యక్షుడిగా నియామకం తర్వాత జిల్లాల వారీగా సమీక్షలు జరుగుతున్నాయి. త్వరలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతల సమావేశం కూడా గాంధీభవన్‌లో జరగనుంది. ఇలా పార్టీని క్షేత్ర స్థాయిలో పటిష్టం చేస్తూ పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం కావాలన్న ఆలోచనలో పార్టీ నేతలు ఉండగా.. పంచాయతీ ఎన్నికల్లో మండలాల సమన్వయం బాధ్యతలను ముఖ్య నేతలకు అప్పగించనున్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీకి బలమైన మద్దతుదారులు సర్పంచ్‌లుగా నెగ్గితే వచ్చే ఎన్నికల సమయాన లాభం జరుగుతుందని భావిస్తున్నారు. దీంతో ఎక్కడా అసంతృప్తి ఎదురుకాకుండా రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల విషయంలో ముఖ్యనేతలు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. నామినేటెడ్ పదవులు దక్కించుకున్న వారే కాక మిగతా నేతలు సమన్వయంతో ముందుకెళ్తేనే మెజార్టీ గ్రామపంచాయతీలను ఖాతాలో వేసుకోవచ్చన్న చర్చ కాంగ్రెస్ పార్టీలో జరుగుతోంది.

ఆస్పత్రుల్లో ఖాళీలు భర్తీ చేస్తాం...

- ప్రతీ జిల్లాకు సెంట్రల్ మెడికల్ స్టోర్ ఏర్పాటు
- నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్‌ను 100 శాతం పూర్తి చేయాలి
- హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్



సత్తుపల్లి ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీహెచ్ రవీంద్రనాయక్

సత్తుపల్లిటౌన్/పెనుబల్లి : గతంలో 11 జిల్లాల్లోనే సెంట్రల్ మెడికల్ స్టోర్లు ఉండేవని, ఇప్పుడు ప్రతీ జిల్లాకు ఒకటి అందుబాటులోకి తెచ్చామని ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ బి.రవీంద్ర నాయక్ వెల్లడించారు. సత్తుపల్లి ఏరియా ఆస్పత్రిని, పెనుబల్లి మండలంలోని లంకాసాగర్ పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.సుబ్బారావుతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. డయాలసిస్, సీమాంక్ కేంద్రాలను పరిశీలించారు. బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రుల్లో వైద్యులు, ల్యాబ్‌టెక్నీషియన్లు, స్టాఫ్‌నర్సుల పోస్టులను త్వరలోనే భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని తెలిపారు. నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్‌ను 100 శాతం పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. లంకాసాగర్ పీహెచ్‌సీకి రోజుకు ఎంతమంది ఓపీ, ఇన్ పేషెంట్లు వస్తున్నారని ఆరా తీశారు. గర్భిణుల నమోదులో జిల్లాలో పీహెచ్‌సీ ప్రథమ స్థానంలో ఉండగా సిబ్బందిని అభినందించారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు క్షేత్రస్థాయిలో తిరుగుతూ అనారోగ్యం బారిన పడిన వారిని గుర్తించి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి. సీతారాం, సత్తుపల్లి ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్, డాక్టర్లు ప్రేమలత, సౌమ్య, సాంబశివరావు, నారాయణమ్మ, సాత్విక్, హెచ్‌ఎస్ హైమావతి, పూలమ్మ, సుగుణ, వాసు, నాగేశ్వరరావు, పొట్టెమ్మ, నిర్మల, బషీరుద్దీన్ పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈల బదిలీలు

- ఖమ్మం సర్కిల్‌కు నలుగురు ఏఈల బదిలీ
- స్థానికుల బదిలీలతో పాటు పోస్టింగ్ ఇవ్వనున్న ఎస్ఈ
- అన్ని కేడర్లలో నేడు బదిలీ ఉత్తర్వులు జారీ

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో ఏఈలు, ఏఏఈలను బదిలీ చేస్తూ వరంగల్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో మొత్తం 48 మంది ఏఈలు, ఏఏఈలను వివిధ సర్కిళ్లకు బదిలీ చేయగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న నలుగురిని ఖమ్మం సర్కిల్‌కు కేటాయించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఎస్పీఎం ఏఈ దారా కృష్ణకాంత్, భద్రాద్రి జిల్లా మణుగూరు ఆపరేషన్ ఏఏఈగా పనిచేస్తున్న జి వేణుగోపాల్, మహబూబాబాద్ రూరల్ మండలం ఆపరేషన్ ఏఏఈగా పనిచేస్తున్న బి.బోజ్యాతో పాటు ఖమ్మం టౌన్–1 సెక్షన్ ఏఈగా పనిచేస్తున్న ఎం.మాలికను డీపీఈ విభాగానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. అయితే తొలుత సర్కిల్ పరిధిలో బదిలీలకు గుర్తించిన 42 మంది ఏఈలు, ఏఏఈలకు సోమవారం పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ అనంతరం ఖమ్మం సర్కిల్‌కు కేటాయించిన వారికి ఖాళీలను బట్టి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. సర్కిల్ పరిధిలో ఈ ప్రక్రియకు అధికారిగా ఎస్ఈ ఎ.సురేందర్ వ్యవహరించనున్నారు.

అన్ని కేడర్లలో నేడు బదిలీ ఉత్తర్వులు జారీ..

ఎన్పీడీసీఎల్ వరంగల్ సీఎండీ ఆదేశాల మేరకు విద్యుత్ ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా సోమవారం అన్ని కేడర్లలో ఇంజనీర్లు, అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు సర్కిల్, డివిజన్ స్థాయి అధికారులు పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. ఒక డివిజనల్ ఇంజనీర్, 10 మంది ఏడీఈలు, 28 మంది సబ్ ఇంజనీర్లు, ఒక సీనియర్ ఎకౌంట్ ఆఫీసర్, ముగ్గురు ఏఏఓలు, 21 మంది జేఏఓలు, 22 మంది సీనియర్ అసిస్టెంట్లు, 8 మంది జూనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు రికార్డు అసిస్టెంట్లు, 11 మంది ఆఫీస్ సబార్డినేట్లు, 8 మంది ఫోర్‌మెన్లు, 16 మంది సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు ఎస్‌జీఎస్‌ఓలు, ఇద్దరు వాచ్‌మెన్లు.. మొత్తం 179 మందికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. కాగా, ఇందులో మంచి పోస్టింగ్‌ల కోసం కొందరు తీవ్రంగా కృషి చేస్తున్నారు. కొందరు యూనియన్ ప్రతినిధుల పేరిట ప్రొటెక్షన్ నిబంధనను ఆయుధంగా మలుచుకొని ఇష్టమైన పోస్టింగ్‌కు దరఖాస్తులు చేసుకున్నారు. ప్రొటెక్షన్ విధానంతో తమకు నష్టం కలుగుతుందని, సంఘాలకు నాయకత్వం వహించే పేరిట కొందరు ఇష్టమైన స్థానాల్లో పోస్టింగ్‌లు పొందే అవకాశం ఉందని మరి కొందరు ఉద్యోగులు విమర్శిస్తున్నారు.

రాష్ట్రపతి నిలయంలో మన విద్యార్థులు



సికింద్రాబాద్ టూరిజం క్లబ్‌లో జిల్లా విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్ : నగరంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాల యువ టూరిజం క్లబ్ విద్యార్థులు 50 మంది సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయాన్ని ఆదివారం సందర్శించారు. భారతీయ కళా మహోత్సవం పేరిట జరుగుతున్న ఈశాన్య రాష్ట్రాల కళలు, జీవన విధానం, ఆహారపు అలవాట్లు, ప్రాంతీయ వైవిధ్య నృత్యరీతులను విద్యార్థులు తిలకించారని కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకిరుల్లా తెలిపారు. రాష్ట్రపతి భవన్, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గత నెల 29న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించగా, ఆదివారం ముగిసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువ టూరిజం క్లబ్ కో ఆర్డినేటర్ ఎం.వి.రమణ, అధ్యాపకులు డి.శ్రీనివాస్, వై.రవివర్ధన్ పాల్గొన్నారు.

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక ఆదివారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

మత్స్యకారులకు ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లు అందుకుంటున్న మత్స్యకారులు

కూసుమంచి : పాలేరులోని మత్స్య పరిశోధనా కేంద్రంలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మత్స్యకారులకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ పొందిన వారికి నైపుణ్య సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ.. చేపల పెంపకం, దిగుబడులపై అవగాహన అవసరమని అన్నారు. అప్పుడే లాభదాయకంగా పెంపకాన్ని చేపట్టవచ్చని తెలిపారు. రీ సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ సిస్టమ్ ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. శిక్షణ పొందిన వారు లాభసాటి చేపల పెంపకం చేపట్టాలని, మత్స్య సంపద వృద్ధి చేయాలని సూచించారు. ఆ తర్వాత మత్స్య శాస్త్రవేత్త రవీందర్ పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

పత్తి కొనుగోళ్లకు సీసీఐ సై!

- ఖరారైన జిన్నింగ్ మిల్లుల టెండర్లు
- ఉమ్మడి జిల్లాలో 9 మార్కెట్ల పరిధిలో ఎంపిక
- 14 మిల్లుల్లో కొనుగోళ్లకు సన్నాహాలు
- పంట నమోదు, ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్ అనుసంధానం తప్పనిసరి



జిన్నింగ్ మిల్లులో రైతు తీసుకొచ్చిన పత్తి (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: పత్తి బేళ్లకు జిన్నింగ్ మిల్లులకు టెండర్లు ఖరారు కావడంతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోళ్లకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే కొత్త పత్తి విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తి గరిష్ఠ ధరను రూ.7,521గా నిర్ణయించింది. 8 నుంచి 12 శాతం వరకు తేమ కలిగిన పత్తిని కొనుగోలు చేసేలా సీసీఐ విధివిధానాలు ఖరారు చేసింది. పత్తికి ప్రభుత్వ మద్దతు ధర రూ. 7,521 కాగా 15 రోజుల క్రితం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రూ.8,000గా పలికింది. కొత్త పత్తి రూ.7,722గా నమోదైంది. దీంతో సీసీఐ కొనుగోలు కేంద్రాల అవసరం ఉండదని అంతా భావించారు. అయితే ఆ ధర వారం కూడా నిలవలేదు. ప్రస్తుతం పాత పత్తి ధర గరిష్ఠంగా రూ.7,500, కొత్త పత్తి ధర రూ.7,000 ఉంది. తేమశాతం ఎక్కువగా ఉంటే వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో సీసీఐ కొనుగోలు కేంద్రాల ఆవశ్యకత పెరిగింది. దీంతో ప్రభుత్వం సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తోంది.

మూడో వారం నుంచి కొనుగోళ్లు



ఈ నెల మూడో వారం నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే జిల్లాలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు నిర్ణయం, ఆయా కేంద్రాల పరిధిలో జిన్నింగ్ మిల్లుల ఎంపిక, టెండర్ల ప్రక్రియ పూర్తి చేశాయి. తేమ శాతం ఆధారంగా నిబంధనలు అనుసరిస్తూ పత్తి కొనుగోళ్లకు సీసీఐ సన్నద్ధమవుతోంది.

– ఎం.ఏ.అలీం, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి

3.77లక్షల ఎకరాలకు పైగానే సాగు..

జిల్లాలో ఈ ఏడాది 1.91 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అయితే, వర్షపాతం సాధారణానికి మించి నమోదు కావడం పంటకు ప్రతికూలంగా మారింది. సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల పత్తి చేలు ఆనవాళ్లు లేకుండా పోయాయి. వర్షాల కారణంగా తేమ పెరిగి పైరు దెబ్బతిన్నది. పూత, కాత దశలో ప్రకృతి వైపరీత్యం కారణంగా దిగుబడిపై ప్రభావం పడింది. గత ఏడాది అనావృష్టి కారణంగా పంట దిగుబడి తగ్గగా, ఈ ఏడాది అధిక వర్షాలతో పైరు దెబ్బతిని దిగుబడిపై ఆశలు సన్నగిల్లాయి. ప్రస్తుత పరిస్థితిలో జిల్లాలో సాగు చేసిన పంట విస్తీర్ణం ఆధారంగా 1,43,044 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఇక భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 1,82,032 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. తద్వారా 1,45,175 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని భావిస్తున్నారు.

నిబంధనలు తప్పనిసరి

పంట కొనుగోలులో ప్రభుత్వం విధించిన నిబంధనలు తప్పనిసరి చేశారు. వ్యవసాయ శాఖ పోర్టల్‌లో పంట నమోదై ఉండాలి. ఇప్పటికే వ్యవసాయ శాఖ నుంచి మార్కెటింగ్ శాఖ, సీసీఐ సంస్థలు పంట నమోదు వివరాలను సేకరించింది. పోర్టల్‌లో పంట నమోదై ఉన్న రైతుల నుంచి మాత్రమే సీసీఐ జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు చేస్తారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకంతో పాటు ఆధార్ నంబర్‌ను బ్యాంక్ ఎకౌంట్‌తో అనుసంధానం చేసుకొని ఉండాలి. ఆ విధంగా ఉన్న రైతుల పంటను మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుంది. ఇప్పటికే కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సీసీఐ ప్రతినిధులు, మార్కెటింగ్, వ్యవసాయ శాఖల అధికారులకు పత్తి కొనుగోలుపై దిశానిర్దేశం చేశారు.

జిల్లాల వారీగా ఇలా..

- ఖమ్మం జిల్లాలోని ఐదు మార్కెట్ల పరిధిలో సీసీఐ ద్వారా పది పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తారు. మధిర, మద్దులపల్లి మార్కెట్ల పరిధిలో మూడు చొప్పున, ఖమ్మం మార్కెట్ పరిధిలో రెండు, వైరా, నేలకొండపల్లి మార్కెట్ల పరిధిలో రెండేసి జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లకు టెండర్లు ఖరారయ్యాయి.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నాలుగు జిన్నింగ్ మిల్లులను సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను ఖరారు చేశారు. ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ పరిధిలోని సింగరేణి, కొత్తగూడెం మార్కెట్ పరిధిలోని సుజాతనగర్, బూర్గంపాడు మార్కెట్ పరిధిలోని లక్ష్మీపురం, భద్రాచలం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని నెల్లిపాక బంజర జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు చేపట్టనున్నారు.

క్లుప్తంగా

వరద బాధితులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న బాలసాని

ఖమ్మంఅర్బన్: నగరంలో ఇటీవల వచ్చిన వరదల ప్రభావంతో సర్వం కోల్పోయిన మెకానిక్ కుటుంబాలకు ఖమ్మం కార్పొరేషన్ టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 30 మందికి రూ.4 లక్షలు ఆర్థిక సాయం చేశారు. ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ నగదును బాధితులకు అందించారు. వరదల్లో 12 దుకాణాలు, 18 నివాసాలు నీట మునిగాయి. జిల్లా అధ్యక్షుడు వంగాల కొండల్‌రావు, మిక్కిలినేని నరేంద్ర, కిలారు బాబ్జీ, కృష్ణారెడ్డి, రాము, నర్సింహారావు, కేసర్, అప్పారావు, రమేశ్, బ్రహ్మం, పాషా తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు



గాయపడిన మనోజ్

నేలకొండపల్లి: బైక్ అదుపుతప్పి ఓ యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. భైరవునిపల్లి గ్రామానికి చెందిన బి.మనోజ్ నేలకొండపల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. కాల్వ సమీపంలో బైక్ అదుపుతప్పి మరో బైక్‌ను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్థానిక పీహెచ్‌సీకి.. అనంతరం ఖమ్మం తరలించారు. మరో బైక్‌పై ఉన్న శ్రీనుకు స్వల్ప గాయాలయ్యాయి.

తండ్రిపై కుమారుడి దాడి

నేలకొండపల్లి: తండ్రిపై కుమారుడు దాడి చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని అనంతనగర్ గ్రామానికి చెందిన బిందె గురవయ్య (65)పై కుమారుడు వీరబాబు దాడి చేసి గాయపరిచాడు. కుటుంబ తగదాల కారణంగా తండ్రిపై కుమారుడు దాడి చేసినట్లు సమాచారం. వృద్ధుడిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు.

ఇరు వర్గాలపై కేసు

కల్లూరు: ఫెన్సింగ్ వేసే విషయంలో ఇరు వర్గాలపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని దారుగాబంజరలో కర్నాటి రాములమ్మ, భర్త వెంకటి తమ స్థలంలో సరిహద్దు గెట్టుకు ఫెన్సింగ్ వేస్తున్నారు. ఈ క్రమంలో బ్రహ్మసాని అర్జున్, కొంగర రవి వచ్చి వెంకటిపై దాడి చేశారు. రాములమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా తమ స్థలం ఆక్రమించి ఫెన్సింగ్ వేస్తున్న వెంకటి, రాములమ్మను తాము నిలదీయడంతో దాడి చేశారని బ్రహ్మసాని అర్జున్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు రాములమ్మ, వెంకటిపైనా కేసు నమోదు చేశారు.

ఇద్దరు మహిళలపై...

పెనుబల్లి: ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేశారు. వేంసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన ప్రియాంక తన భర్త రవీందర్‌రావుతో కలిసి పెనుబల్లి బైపాస్‌రోడ్డులో అద్దెకు ఉంటోంది. రవీందర్‌రావు మొదటి భార్య దివ్య పెనుబల్లి వచ్చి ప్రియాంకను గర్భవతి అని కూడా చూడకుండా కొట్టి దుర్భాషలాడింది. చీపిరికట్టతో కొట్టింది. ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వీఎం బంజర్ ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. ఇదిలా ఉండగా.. వేంసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన కొప్పుల రవీందర్‌రావు మొదటి భార్య దివ్య మాట్లాడుతూ.. తన భర్త తాగుడుకు బానిసై వేరే అమ్మాయిలతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, ఈ క్రమంలో సత్తుపల్లి మండలం తాళ్లమడకు చెందిన ఐనంపూడి ప్రియాంకతో కూడా అక్రమ సంబంధం పెట్టుకొని పెనుబల్లి బైపాస్ రోడ్డులో అద్దెకు ఉంటున్నాడని తెలిపింది. ఆదివారం తాను అక్కడికి వెళ్లి భర్త రవీందర్‌రావును ప్రశ్నించగా రవీందర్‌రావుతో పాటు ప్రియాంక బావ చిన్నికృష్ణ తనను కొట్టి, తిట్టారని వీఎం బంజర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.వెంకటేశ్ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

అశ్వారావుపేట: మండల పరిధిలోని ఊట్లపల్లి చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంకు చెందిన రామిశెట్టి అప్పారావు తన తమ్ముడి ఇంటికి ఊట్లపల్లి వచ్చాడు. ఆతర్వాత శనివారం జంగారెడ్డిగూడెం వెళ్తున్నానని చెప్పి తమ్ముడి ఇంటి నుంచి బయలుదేరాడు. ఆదివారం అదే గ్రామంలోని చెరువులో పడి మృతి చెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడిని గుర్తించిన సోదరుడు అప్పారావు ఫిర్యాదు మేరకు ఎస్సై యయాతి రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

నాడు రైతులు... నేడు కూలీలు



పనులు లేక గ్రామంలోనే ఉన్న రాకాసితండా వాసులు

- అన్నదాతలకు కష్టాలు మిగిల్చిన ఆకేరు వరద
- రాకాసి తండా పొలాల్లో ఇసుక మేటలు, రాళ్లకుప్పలు
- సాగు చేసే పరిస్థితి లేక ఉపాధి కోసం రైతుల వెతలు
- రోజులు గడుస్తున్నా అందని నష్టపరిహారం

తిరుమలాయపాలెం: పచ్చని పంట పొలాలతో కళకళలాడే ఆ ప్రాంతం నేడు ఇసుక కుప్పలు, రాళ్లరప్పలతో కనిపిస్తోంది. పలువురికి పని కల్పించే ఆ రైతుల ఇళ్లలో ధాన్యం నిల్వలు ఉండేవి. కానీ, ఇప్పుడు దాతలు ఇచ్చే నిత్యావసరాలతో కాలం గడపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అంతేకాక సొంత పొలాల్లో పనిచేసే పరిస్థితి లేక ఇతర ప్రాంతాల్లో కూలీ పనులు వెతుక్కోవాల్సి వస్తోంది. భారీ వర్షాలు, వరదలతో సర్వం కోల్పోగా తిరుమలాయపాలెం మండలంలోని అజ్మీరాతండా గ్రామ పంచాయతీ పరిధి రాకాసితండా వాసుల దైన్యస్థితి ఇది.

నెల దాటినా ఆరని క'న్నీరు'

గత నెల 1వ తేదీ తెల్లవారుజామున ఆకేరు వరద రాకాసితండాను ముంచెత్తింది. వరదలతో పంటలు కోల్పోవడమే కాక పొలాల్లో ఇసుక మేటలు, రాళ్లు చేరగా నేటికీ అదే పరిస్థితి ఉంది. ప్రభుత్వం నుంచి కూడా ఇంత వరకు నష్టపరిహారం అందలేదు. ఇళ్లు, సామగ్రి కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే రూ.16,500 సైతం ఇంకా 11 కుటుంబాలకు అందలేదని చెబుతున్నారు. దీంతో దాతలు ఇచ్చిన నిత్యావసరాలతో జీవనం సాగిస్తున్న తండా వాసులు పొలాల్లో పనులు చేసే పరిస్థితి లేక ఎలా బతకాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయకూలీ పనులు కూడా లభించడం లేదని చెబుతున్నారు. ఇక తడిసిన ధాన్యం కొంటామని ప్రభుత్వ పెద్దలు, అధికారులు చెప్పినా ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈక్రమాన సర్వం కోల్పోయిన రాకాసితండా ప్రజలకు వారి బంధువులు, దాతలు బియ్యం, ఇతర సామగ్రి అందిస్తూ ధైర్యం చెబుతుండగా.. ఇళ్లు, పంటలు కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

80 బస్తాల ధాన్యం తడిసింది..



ఈ రైతు పేరు సహదేవ్. గత యాసంగిలో పండించిన వరి ధాన్యాన్ని ఇంట్లో నిల్వ చేసే చోటు లేక పొలంలో మంచె వేసి దానిపై భద్రపరిచాడు. వరద ప్రవాహంతో 80 బస్తాల ధాన్యం పూర్తిగా తడిసి పోయింది. గ్రామానికి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్తే వెంటనే కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. కానీ, ఇప్పటికీ ధాన్యం కొనుగోలు అంశాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఇక పొలమంతా పూర్తిగా ఇసుక మేటలు వేసింది. పంటకు పరిహారం అందలేదు. దీంతో ఏం చేయాలో దిక్కు తోచడం లేదని వాపోతున్నాడు. గతంలో నలుగురికి పని కల్పించిన తాము ఇప్పుడు కూలీ పనులకు వెళ్తున్నామని చెబుతున్నాడు.



చీపుర్లు తయారు చేసుకుంటున్న మహిళలు



కుప్పలుగా రాళ్లు చేరిన పొలం

పంట చేను మొత్తం ఇసుకే..



రెండు లక్షల రూపాయలు ఖర్చు చేసి మల్చింగ్ పద్ధతిలో మిర్చి పంటతోపాటు వరి పొలం సాగుచేశా. ఆకేరు వరదతో పొలమంతా ఇసుక మేటలు వేసింది. ఇప్పటికీ పరిహారం రాలేదు. ఇసుక మేటలు తొలగించాలంటే రూ.లక్షలు కావాలి. ప్రభుత్వం ఆదుకుంటే తప్ప బతికే పరిస్థితి లేదు.

–బోడ లచ్చా, రైతు, రాకాసితండా

అద్దె ఇంట్లో ఉంటున్నాం..



వరదలో నా ఇల్లు సహా సామగ్రి అంతా కొట్టుకుపోయింది. పిండిప్రోలులో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నాం. ప్రభుత్వం ఇచ్చే రూ.16,500 కూడా రాలేదు. నా భర్త ఖమ్మంలో సుతారీ పనులకు వెళ్తున్నాడు. నేను మేకలు, గేదెలు కాస్తున్నా. అన్నీ కోల్పోయిన మమ్మల్ని ఆదుకోవాలి.

–జర్పుల పద్మ, రాకాసితండా

పనులు కూడా లేవు..



కూలీ పనులు లేక ఇంటి దగ్గరే ఉంటున్నాం. అప్పుడప్పుడు ఇతర గ్రామాల రైతులు కూలీకి పిలిస్తే వెళ్తున్నాం. వరదల్లో అన్నీ కోల్పోయిన మేం ఎలా బతకాలో తెలియడం లేదు. మాకు ఇంకో ప్రాంతంలో ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టిస్తే తప్ప వరద భయం పోదు.

–బానోతు అనిత, రాకాసితండా

జాతిని జాగృతం చేసే 'కథ'..

'కథ-2023' పుస్తకావిష్కరణలో కవి రవిమారుత్

ఖమ్మంగాంధీచౌక్: సమాజాన్ని మేల్కొలిపేది, బతుకుబాట పట్టించేది, వ్యవస్థల దురాగతాన్ని ఎండగట్టేది అణచబడిన, దాష్టికాలకు గురైన జీవితాలను ప్రజ్వలింపచేసేది 'కథ' అని కవి, విద్యావేత్త రవిమారుత్ అన్నారు. జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఖమ్మం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'కథ – 2023' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. అధ్యక్షత వహించిన రవిమారుత్ ప్రారంభోపన్యాసం చేస్తూ.. 34 ఏళ్లుగా ఉత్తమ కథా సంకలనాలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు పాఠకులకు అందిస్తున్న జాషువా సాహిత్య వేదిక వారు ఈ ఏడాది కథ-2023 పుస్తకాన్ని పాఠకులకు అందించటం అభినందనీయమన్నారు. సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్ చేతులమీదుగా పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కథ సమాజ జీవిత మనుగడలో ఒక భాగమయ్యిందన్నారు. కార్యక్రమంలో కె.శివారెడ్డి, ముద్వా శ్రీనివాసరావులు కథల విశిష్టతను వివరించారు. కథా సాహితీ సంపాదకులుగా వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్‌లు వ్యవహించారు. కార్యక్రమంలో పుస్తక సంకనలనంలో కథా రచయితలు కుప్పిలి పద్మ, కత్తి పద్మ, బెజ్జారపు రవీందర్, పాణిని జన్నాబట్ల అఫ్సర్, వేంపల్లి షరీఫ్, యాజీ, స్ఫూర్తి కందివనం, సుజాత వేల్పూరి, అనిశెట్టి శ్రీధర్, డాక్టర్ కేవీ రమణారావు, దేశరాజు, సతీశ్‌చందర్, ఛాయ బోహన్‌బాబు, శ్రీనివాస్‌గౌడ్ తాము రచించిన కథా నేపథ్యాన్ని వివరించారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆర్థిక సాయంతో అతి తక్కువ ధరకు ఈ కథా సంకలనాలను పాఠకులకు అందిస్తామని వెల్లడించారు.

బతుకమ్మ పూలు కోసేందుకు వెళ్లి..

విద్యుదాఘాతంతో బాలుడు మృత్యువాత

రఘునాథపాలెం: ఐదు రోజులుగా నిత్యం బతుకమ్మ సంబరాల్లో ఆనందంగా గడుపుతున్న ఆ కుటుంబానికి అనుకోని విషాదం వచ్చింది. తల్లి, ఇద్దరు సోదరీమణులు ఆడుకునే బతుకమ్మను తయారు చేసేందుకు పూల కోసం వెళ్లిన బాలుడు విద్యుదాఘాతంతో కానరాని లోకానికి వెళ్లాడు. ఈ ఘటన రఘునాథపాలెం మండలం పాపటపల్లిలోని డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. సీఐ ఉస్మాన్ షరీఫ్ కథనం ప్రకారం.. డబల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న మిట్టపల్లి వెంకన్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు చరణ్ తేజ్ (16) ఉన్నారు. చరణ్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సెలవులు కావడంతో బతుకమ్మ పేర్చేందుకు పూలు తెస్తానంటూ ఉదయం 8 గంటలకు ఇంటి పక్కనున్న బిల్డింగ్ ఎక్కాడు. టేకు పూలు కోస్తుండగా పక్కనే ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలు చెట్టు కొమ్మకు తగిలి విద్యుత్ సరఫరా కాగా, ఆ షాక్‌కు చరణ్‌తేజ్ అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. పండుగ సంబరాల్లో ఆనందంగా గడపాల్సిన కుమారుడు పూల కోసం వెళ్లి తనువు చాలించడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో హైటెన్షన్ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారి నిర్లక్ష్యం వల్లే బాలుడు మృతి చెందాడని ఆరోపిస్తున్నారు. సమాచారం తెలియగానే సీఐ ఉస్మాన్‌షరీఫ్ చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన చరణ్‌తేజ్ (ఫైల్)

చేయని తప్పునకు వ్యక్తి బలి..!

అవమాన భారంతో వ్యక్తి ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్: ఓ వ్యక్తి తన స్నేహితుడి ఫోన్ నుంచి మహిళకు ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడాడు. సదరు మహిళ భర్త, బంధువులు పంచాయితీ నిర్వహించి ఫోన్ యజమానిపై దాడి చేశారు. తీవ్ర మనస్తాపానికి గురైన ఫోన్ యజమాని పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని రేగళ్లపాడులో ఆదివారం చోటుచేసుకుంది. మృతుడి భార్య నాగుర్‌బీ కథనం ప్రకారం.. మండలంలోని రేగళ్లపాడు గ్రామంలో కిరణాషాపు నిర్వహిస్తున్న పాషా (32)కు యాతాలకుంటకు చెందిన ధనికుల కాసుబాబు స్నేహితుడు. అయితే పాషా ఫోన్ నుంచి కాసుబాబు.. యాతాలకుంటకు చెందిన ఓ గిరిజన వివాహితకు ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడాడు. దీంతో ఆమె భర్త, కుటుంబ సభ్యులందరూ కలిసి పాషా ఫోన్ నుంచే కాల్‌రావటంతో పంచాయితీ పెట్టి పాషాపై చేయి చేసుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన పాషా శనివారం రాత్రి పురుగుమందు సేవించాడు. ఆయన్ను ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆదివారం సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో పాషా మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడి భార్య నాగూర్‌బీ ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నారు. కాసుబాబు పరారీలో ఉన్నాడు. కాగా పాషాపై దాడిచేసిన జవ్వాజి రాము, రాజు, సుమలత, సున్నం నాగరాజు, జవ్వాజి చిన్నారాజు, ఏడుకొండలుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



పాషా మృతదేహం

యువకుడి మృతిపై కేసు

కామేపల్లి: మండలంలోని పాతలింగాల గ్రామానికి చెందిన యరకల అశోక్‌కుమార్(32) కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం మద్యం మత్తులో ఇంట్లో ఓ ఇనుప రాడ్డుకు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం మృతుడి తల్లి కోటమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సాయికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాటి చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి



సురభి బాబు మృతదేహం

కొణిజర్ల: తాటి మట్టలు కొట్టేందుకు తాటి చెట్టు ఎక్కి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని సింగరాయపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సింగరాయపాలేని కి చెందిన గీత కార్మికుడు సురభి బాబు (54) ఆదివారం ఇంటి సమీపంలోని తాటిచెట్టు మట్టలు నరికేందుకు ఎక్కి ప్రమాదవశాత్తు పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పుల్లమ్మ, కుమారుడు చిరంజీవి, కుమార్తె కృష్ణవేణి ఉన్నారు. బాబు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

తప్పిన పెను ప్రమాదం



ప్రమాదంలో గాయపడిన రజియా

కామేపల్లి: ఆటోడ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకోగా ఆటోలో ప్రయాణిస్తున్నవారు పెనుప్రమాదం నుంచి బయటపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. ఓ ఆటో ఖమ్మం నుంచి కామేపల్లి వెళ్తుండగా పండితాపురం బైపాస్ రోడ్డు సమీపంలో ఆటోడ్రైవర్‌కు ఫిట్స్ వచ్చాయి. ఆటో అదుపుతప్పి చెట్టుకి ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఆరుగురు ప్రయాణికులు ఉండగా వీరిలో ఊట్కూర్ గ్రామానికి చెందిన రజియాకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగ్రాతులను 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ



గాయపడిన నాగయ్య

కామేపల్లి: శుభకార్యానికి వెళ్లి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలైన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. సాతానిగూడెం జీపీ ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన తేనె నాగయ్య, గుగులోత్ రవి బైక్‌పై పండితాపురం సంత సమీపంలో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వస్తున్నారు. ఓ లారీ అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టగా ఇద్దరూ గాయపడ్డారు. నాగయ్య పరిస్థితి విషమంగా ఉంది. క్షతగ్రాతులను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రేషన్ బియ్యం విక్రయదారులపై కేసు

పెనుబల్లి: పేదల నుంచి రేషన్ బియ్యం సేకరించి, కోళ్ల ఫారాలకు విక్రయిస్తున్న వ్యక్తిపై.. బియ్యం కొంటున్న కోళ్ల ఫారం యజమానిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని సూరయ్యబంజర్‌కు చెందిన ధరావత్ గోపాలస్వామి చుట్టు పక్కల గ్రామాల్లోని పేదల వద్ద నుంచి రేషన్ బియ్యం సేకరించి, వాటిని బయ్యన్నగూడెంలోని కోళ్లఫారం యజమాని వెంకటేశ్వరరావుకు విక్రయిస్తున్నాడు. వీఎం బంజర్ ఎస్‌ఐ వెంకటేశ్ సిబ్బందితో ఆదివారం సూరయ్యబంజర్ తండాలోని ధరావత్ గోపాలస్వామి ఇంటిపై దాడి చేసి 5 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. గోపాలస్వామి, బియ్యం కొనుగోలు చేస్తున్న వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు.

అమెరికాలో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: అమెరికాలోని సెయింట్ లూయిస్ నగరంలో తెలంగాణకు చెందిన మహిళలు బతుకమ్మ వేడుకలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ బతుకమ్మను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. మందపాటి అనితారెడ్డి మిత్రబృందం నేతృత్వంలో మహిళలు బతుకమ్మలతో ఓ ప్రాంతానికి చేరుకొని గౌరవమ్మకు పూజలు చేశారు.

కేంద్ర ప్రభుత్వ అవార్డుకు ఎంపిక



త్రినాథ్‌ను అభినందిస్తున్న డీజీపీ జితేందర్‌రెడ్డి

సత్తుపల్లి: కేంద్ర ప్రభుత్వ అవార్డుకు సత్తుపల్లికి చెందిన రాష్ట్ర ఎస్‌పీఎఫ్ కమాండెంట్ నరుకుళ్ల త్రినాథ్ ఎంపిక కాగా ఆయనను ఆదివారం డీజీపీ జితేందర్‌రెడ్డి అభినందించారు. త్రినాథ్ సత్తుపల్లి మండలం గంగారంలోని దాసరి వీరారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, సత్తుపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, జేవీఆర్ కళాశాలలో డిగ్రీ చదివారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చేసి, పోలీస్ శాఖలో ఎస్‌పీఎఫ్ ఎస్సైగా చేరి అంచలంచెలుగా ఎదిగారు. కేంద్ర ప్రభుత్వ అవార్డుకు ఎంపికైన త్రినాథ్‌కు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో పాటు పూర్వ విద్యార్థులు అభినందనలు తెలిపారు.

వచ్చీరాని వైద్యం చేసిన ఆర్‌ఎంపీ

గోవింద్రాలలో విషమ స్థితిలో చిన్నారి



ఇన్ఫెక్షన్ అయిన తొంటి భాగం

కామేపల్లి: ప్రథమ చికిత్సకే పరిమితం కావాల్సిన ఆర్‌ఎంపీలు వచ్చీరాని వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మండలంలోని ఓ ఆర్‌ఎంపీ అవగాహన లేని వైద్యంతో ఓ చిన్నారికి ఇంజెక్షన్ చేయగా ప్రాణాప్రాయ స్థితిలో అల్లాడుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని గోవింద్రాల గ్రామానికి చెందిన కటారియా అశోక్ – నిర్మల దంపతుల మూడేళ్ల కుమార్తె రితికాకు వారం రోజుల కిందట జ్వరం, దగ్గు రావడంతో స్థానిక ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆయన ఇంజక్షన్ వేశాడు. మరుసటి రోజు కూడా జ్వరం తగ్గక పోవడంతో మళ్లీ వెళ్లగా మరో ఇంజక్షన్ వేశాడు. అయినప్పటికీ జ్వరం తగ్గకపోగా, ఇంజక్షన్ వేసిన భాగంలో ఎర్రగా కనిపించడంతో ఆర్‌ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా పట్టించుకోలేదు. చిన్నారిని ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి ఇంజక్షన్ వేసిన తొంటి భాగంలో ఇన్ఫెక్షన్ అయిందని తేలినట్లు సమాచారం. నాలుగు రోజులుగా చిన్నారికి వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ పరిస్థితి మెరుగుపడకపోవడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రసుత్తం చిన్నారి పరిస్థితి విషయమంగా ఉందని తెలిసింది. ఆర్‌ఎంపీపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చిన్నారి తండ్రి అశోక్ తెలిపారు.



ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న రితిక

భద్రకాళి మాతగా మారెమ్మతల్లి



భద్రకాళి అమ్మవారి అలంకరణలో మారెమ్మతల్లి

ఖమ్మంరూరల్ : మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ మారెమ్మతల్లి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఆదివారం భద్రకాళి మాతగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా, భక్తులు భారీగా తరలివచ్చారు. మొదట గణపతి పూజ, అమ్మవారి అష్టోత్తర శత నామార్చన, రుద్రహోమం తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జగన్‌మోహన్‌రావు, ప్రధానార్చకులు కాశావఝ్జల రామశర్మ, అర్చకులు గండికోట నరేందర్ శర్మ, కాశావఝ్జల సతీష్ శర్మ, చక్రధర్ శర్మ, వాసుదేవ శర్మ, హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.